క్లుప్తంగా

మిస్ అండ్ మిస్టర్ టీన్ విజేతగా నేహాంజలి



మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): అలీ క్లబ్ మిస్ అండ్ మిస్టర్ టీన్ ఇండియా–2024 ఫైనల్ పోటీల్లో తమ విద్యాసంస్థకు చెందిన దండా నేహాంజలి (14) విజేతగా నిలిచిందని చైతన్య విద్యాసంస్థల రీజనల్ ఇన్‌చార్జి ఆర్. పద్మ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. విజయవాడ భవానీపురానికి చెందిన దండా రాంబాబు, సామ్రాజ్యం కుమార్తె నేహాంజలి (14) చిన్నతనం లోనే మోడలింగ్‌పై ఆసక్తి చూపించిందని పేర్కొన్నారు. ఇటీవల ఢిల్లీ వేదికగా జరిగిన అలీ క్లబ్ మిస్ అండ్ మిస్టర్ టీన్ ఇండియా–2024 ఫైనల్స్‌లో 167 నగరాల నుంచి సుమారు 90 మంది టీనేజర్లు పాల్గొనగా వారిలో నేహాంజలి ప్రతిభ చూపిందని వివరించారు. మొగల్రాజపురంలోని చైతన్య టెక్నో స్కూల్ ప్రిన్సిపాల్ షబానా, డీన్ టి.శ్రీచరణ్‌తో పాటుగా ఉపాధ్యాయులు నేహాంజలిని అభినందించారు.

ముమ్మరంగా రోడ్ల మరమ్మతులు



మధురానగర్(విజయవాడసెంట్రల్): బుడమేరు వరద ప్రభావంతో దావు బుచ్చయ్యకాలనీలో పాడైన రోడ్లకు శుక్రవారం మరమ్మతులు చేశారు. జేసీబీ సాయంతో గుంతలు పూడ్చి రాకపోకలకు వీలుగా సరిచేశారు. అలాగే వరద నీరు తొలగిపోయిన ప్రాంతాల్లో బ్లీచింగ్ వేశారు. ఈ సందర్భంగా శానిటరీ ఇన్‌స్పెక్టర్ కమాలకర్, మేస్త్రి శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రజలు కాచి చల్లార్చిన నీటినే తాగాలని సూచించారు. అలాగే చెత్తాచెదారం ఎక్కడ పడితే అక్కడ పారవేయకుండా పారిశుధ్య సిబ్బందికి ఇవ్వాలని కోరారు. ముఖ్యంగా మురుగుకాలువలు, బుడమేరు, ఏలూరు కాలువల్లో చెత్త వ్యర్థాలు వేయరాదని సూచించారు.

నాగ గణపతికి ప్రత్యేక పూజలు



మధురానగర్(విజయవాడ సెంట్రల్): మధురానగర్ నేతాజీ కాలనీ పప్పులమిల్లు సెంటర్ సమీపంలో బోనం నాగు ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యాన వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం నాగ గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి విశేషంగా గరికతో పూజలు చేశారు. మహిళలు పారాయణం చేశారు. ఆదివారం అన్నప్రసాద కార్యక్రమం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు బోనం నాగు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ పిల్లి జయకృష్ణ, కృష్ణమోహన్, ఉడా వెంకటేశ్వరరావు, తోటకూర వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ సేవలు నిరుపమానం



మధురానగర్(విజయవాడసెంట్రల్): లయన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ ఈస్ట్ సేవలు అభినందనీయం అని 18 ఏళ్ల 30వేల మందికి ఉచితంగా కంటి ఆపరేషన్‌లు చేయడం వారి సేవాగుణానికి అద్దం పడుతుందని టీడీపీ ఫ్లోర్ లీడర్ నెల్లిబండ్ల బాలస్వామి అన్నారు. స్థానిక చుట్టుగుంట లయన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ ఈస్ట్ కంటి ఆసుపత్రిలో శస్త్ర చికిత్స చేయించుకున్న వారికి శుక్రవారం పండ్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్లబ్ ప్రతినిధులను ప్రతిఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మాజీ గవర్నర్ గోపీనాథ్, జీఎన్ శంకర్‌గుప్తా, బీ మోహన్‌రావు, బీ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అల్లూరికి సముచిత స్థానం

మధురానగర్(విజయవాడసెంట్రల్): విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు పేరు భోగాపురం ఎయిర్‌పోర్టుకు పెట్టాలని క్యాబినెట్ తీసుకున్న నిర్ణయం అభినందనీయం అని దక్షిణాది రాష్ట్రాల ఫెడరేషన్ ఆఫ్ క్షత్రియ సేవా సంఘం ఉపాధ్యక్షుడు పీవీఎస్ ఆంజనేయరాజు శుక్రవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తంచేశారు. ఎయిర్‌పోర్టుకు అల్లూరి పేరు పెట్టడంతో ఆయనకు సముచిత స్థానం లభిస్తుందన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

చారిత్రక ఘట్టం

భోగాపురం ఎయిర్‌పోర్టుకు అల్లూరి సీతారామరాజు పేరు పెట్టాలని నిర్ణయించడం చారిత్రాత్మక ఘట్టం అని క్షత్రియ కార్పొరేషన్ సాధన సమితి రాష్ట్ర కన్వీనర్ గొట్టుముక్కల రఘురామరాజు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు.

అమలుకాని ఆరు హామీలు

- అధికారం చేపట్టి 100 రోజులు పూర్తి
- నియోజకవర్గంలో ఒక్క హామీ కూడా అమలుకాని వైనం



ఎన్నికల సమయంలో ఎమ్మెల్యే బొండా ఉమా ఇచ్చిన హామీల పత్రం

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): నన్ను ఎమ్మెల్యేగా గెలిపిస్తే సెంట్రల్ నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో పరుగులు పెట్టిస్తా.. ఉద్యానవనాలు పునరుద్ధరిస్తా.. ప్రతి ఇంటికి స్వచ్ఛమైన తాగునీరు.. గోతులు లేని రోడ్లు, వాకింగ్ ట్రాక్స్ నిర్మిస్తా.. హస్పిటల్స్ బాగుచేయిస్తా.. వ్యాధులను తగ్గించేస్తా.. గంజాయి, బ్లేడ్ బ్యాచ్‌ను అణిచివేస్తా.. యువతకు జాబ్ మేళాలు పెట్టిస్తా.. నియోజకవర్గ రూపురేఖలు పూర్తిగా మార్చేస్తా..' అంటూ ఎన్నికల ముందు నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు హామీల వర్షం కురిపించారు. అధికారంలోకి వచ్చి 100 రోజులు గడుస్తున్నా వాటిలో నేటికీ ఏ ఒక్కటీ ఆయన కనీసం ప్రారంభించకపోవడం గమనార్హం.

1) పచ్చదనం.. స్వచ్ఛమైన తాగునీటికి ప్రాధాన్యత

నియోజకవర్గంలో పచ్చదనాన్ని పెంపొందిస్తానని.. పిల్లల మానసిక ఉల్లాసం కోసం ఉద్యానవనాలను పునరుద్ధరిస్తా.. ప్రతి ఇంటికి స్వచ్ఛమైన తాగునీరు అందిస్తానని హామీ ఇచ్చారు. వీటితో పాటు మద్యపాన విక్రయ నిషేధ స్థలాలను ఏర్పాటు చేస్తానని.. నూతన ఫ్లై ఓవర్లను నిర్మిస్తామని కూడా ఎన్నికల ప్రచారంలో ఆయన చెప్పుకొచ్చారు.

2) మహిళలకు చేయూత..

బాలింతలకు రూ. 5 వేల ఆర్థిక సాయం.. ఎమ్ఎస్ఎమ్ఈల ద్వారా మహిళలకు మరిన్ని అవకాశాలు కల్పిస్తామని.. ప్రభుత్వ బస్సుల్లో ఉచిత రవాణా సౌకర్యం కల్పిస్తామన్న హామీలను ఇప్పటికీ అమలుచేయలేదు.

3) నిరుద్యోగ యువతకు ఉజ్వల భవిష్యత్తు

స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాలను ఏర్పాటుచేసి.. నిరుద్యోగ యువతకు జాబ్‌మేళాలు నిర్వహించి ఉద్యోగాలు కల్పిస్తా.. వారికి ఉజ్వల భవిష్యత్తును అందిస్తా.

కూటమిలానే ఇక్కడా సూపర్‌సిక్స్

కూటమి ప్రభుత్వం ఇచ్చిన సూపర్‌సిక్స్ హామీల మాదిరిగానే ఎమ్మెల్యే బొండా ఉమా కూడా తను గెలిస్తే నియోజకవర్గంలో చేపట్టబోయే అభివృద్ధి పనుల గురించి ఆరు పట్టీల రూపంలో ప్రజలకు హామీలు ఇచ్చారు.

అలాగే క్రీడా మైదానాలను అభివృద్ధి చేసి యువతను క్రీడలవైపు ప్రోత్సహిస్తానని హామీ ఇచ్చారు.

4) గుంతలు లేని రోడ్లు.. ఎల్ఈడీ లైట్ల ఏర్పాటు

ప్రయాణికుల భద్రతను దృష్టిలో పెట్టుకొని గుంతలు లేని రోడ్లు నిర్మించి నిరంతరం వాటిని పర్యవేక్షిస్తాం.. రోడ్డుకు ఇరువైపులా ఎల్ఈడీ లైట్ల ఏర్పాటు.. సైక్లింగ్, వాకింగ్ ట్రాక్‌లు నిర్మిస్తాం.

5) దోమలను కట్టడి చేసి వ్యాధులు నివారిస్తాం..

సెంట్రల్‌లో మలేరియా, డెంగ్యూ, చికున్‌గునియా, క్షయ వంటి వ్యాధులను కట్టడిచేస్తాం. దోమలను అరికట్టి సమర్థవంతమైన పారిశుద్ధ్య పనులు చేపడతాం. అన్ని హాస్పిటల్స్‌లో స్పెషలిస్ట్, సూపర్ స్పెషలిస్ట్‌లను అందుబాటులో ఉంచి వైద్య సేవలు అందిస్తాం.

6) బ్లేడ్ బ్యాచ్.. గంజాయి బ్యాచ్‌లను నిర్మూలిస్తాం

తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే బ్లేడ్ బ్యాచ్, గంజాయి బ్యాచ్‌లను నిర్మూలించేందుకు ప్రత్యేక నిఘా వ్యవస్థను ఏర్పాటుచేస్తాం.. అన్నివర్గాల ప్రజల రక్షణకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

ఎన్నికల ముందు సెంట్రల్ ప్రజలకు ఎమ్మెల్యే బొండా ఉమా ప్రత్యేకంగా ఇచ్చిన ఆరు హామీల్లో ఒక్కటంటే ఒక్కటి కూడా ఇంత వరకు అమలు చేయలేదు. రానున్న రోజుల్లో అయినా నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తారో లేదోనన్న అనుమానాలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి.

కూటమి ప్రభుత్వం 100 రోజుల్లోనే అట్టర్ ఫ్లాప్

వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు మల్లాది విష్ణు



మధురానగర్(విజయవాడసెంట్రల్): కూటమి ప్రభుత్వ 100 రోజుల పాలన అట్టర్ ఫ్లాప్ అని వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలో కేవలం రెడ్‌బుక్ రాజ్యాంగం అమలవుతోందని.. దాడులు, ఆస్తుల విధ్వంసం, అక్రమ కేసులు, అరెస్టులతో తప్పుడు సంప్రదాయానికి చంద్రబాబు నాంది పలికారని మండిపడ్డారు. గతంలో ఏ ప్రభుత్వం ఇంత పెద్దఎత్తున ప్రజావ్యతిరేకతను మూటగట్టుకోలేదని.. వంద రోజుల్లోనే రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలు రోడ్డు ఎక్కారని చెప్పుకొచ్చారు. ఎన్నికల ముందు ఆర్భాటంగా ప్రకటించి ప్రచారం చేసిన సూపర్ సిక్స్ హామీలు ఏమయ్యాయని ఈ సందర్భంగా ఆయన ప్రశ్నించారు. అమ్మఒడి కాపీ కొట్టి తల్లికి వందనం అన్నారు. స్కూళ్లు తెరిచి ఇన్నాళ్లయినా ఏ ఒక్క తల్లి ఖాతాలో అయినా నగదు జమ అయిందా..? సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజారోగ్యం పూర్తిగా పడకేసిందని.. ఆరోగ్యశ్రీని పూర్తిగా నిర్వీర్యం చేశారని విమర్శించారు.

నెట్‌వర్క్ ఆస్పత్రుల బిల్లులు రూ. 2 వేల కోట్ల పైచిలుకు దాటినా.. ఇంతవరకు చెల్లించిన పాపాన పోలేదన్నారు. వైఎస్ జగన్‌కు ఎక్కడ మంచి పేరు వస్తుందోనన్న అక్కసుతో.. మెడికల్ కాలేజీలను అమ్మేస్తూ నిరుపేద విద్యార్థులను వైద్య విద్యకు దూరం చేస్తోంది వాస్తవం కాదా..? అని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఈ ఏడాది విద్యాదీవెన సొమ్ము పెండింగ్ పెట్టారని.. ఇంకా వసతి దీవెన కూడా ఎగరగొట్టేశారన్నారు. యువతకు పెద్దఎత్తున ఉద్యోగావకాశాలు కల్పిస్తామని నమ్మబలికి.. నిరుద్యోగ భృతి కూడా అందించలేకపోయారని ఎద్దేవా చేశారు. ఉచిత బస్సు ప్రయాణం ఊసే లేదన్నారు. 18 నుంచి 59 ఏళ్ల వయస్సు లోపు మహిళలందరికీ నెలకు రూ. 1,500 చొప్పున ఇస్తామన్న ఆర్థిక సాయం ఏమైందో సమాధానం చెప్పాలన్నారు. చంద్రబాబు 100 రోజుల పాలన అన్నదాతలకూ అంతులేని వ్యథను మిగిల్చిందన్నారు. గత ప్రభుత్వంలో వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సాగుకు ముందుగానే పెట్టుబడి సాయం అందించారని.. కూటమి ప్రభుత్వం వచ్చాక రైతు భరోసా కేంద్రాలు, పంటల బీమాను రద్దు చేశారని మండిపడ్డారు.

అప్పులు ఎందుకు చేశారో సమాధానం చెప్పాలి..

అధికారంలోకి రావడంతోనే జూన్ 11న రూ. 2 వేల కోట్ల అప్పు చేసిన కూటమి ప్రభుత్వం.. ఆ తర్వాత జూలై 2న రూ. 5 వేల కోట్లు, జూలై 16 రూ. 2 వేల కోట్లు, జూలై 30న రూ. 3 వేల కోట్లు, ఆగస్టు 27న రూ. 3 వేల కోట్లు, సెప్టెంబరు 3న మరో రూ. 4 వేల కోట్ల అప్పు చేశారని తెలిపారు. ఏ ఒక్క సంక్షేమ పథకం అమలు చేయకపోయినా, అంత అప్పు ఎందుకు చేశారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

చంద్రబాబు తప్పిదం వల్లే విపత్తు

చంద్రబాబు తప్పిదం వల్లనే విజయవాడలో వరద విపత్తు సంభవించిందని.. వరదలు వస్తాయని తెలిసినా ఫ్లడ్ మేనేజ్‌మెంట్ గురించి పట్టించుకోలేదని మల్లాది విష్ణు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫలితంగా నగరంలో 60 మంది అమాయకులు చనిపోయారని, 2.5 లక్షల కుటుంబాలు రోడ్డున పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు.

బాబు మాటలు... నీటి మూటలు

మొత్తానికి చంద్రబాబు 100 రోజుల పాలన 'ఆడ లేక మద్దెలఓడు' అన్నట్లుగా ఉందని మల్లాది విష్ణు అభిప్రాయపడ్డారు. 3 నెలల్లోనే పాలకుల అసమర్థత అంతా బయటపడిందని.. బాబు మాటలు నీటి మూటలని మరోసారి రుజువైందన్నారు. అదే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన 100 రోజుల్లోనే 87 శాతం హామీలు అమలు చేశారని.. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని చూసి ఎక్కడా వెనకడుగు వేయలేదని గుర్తుచేశారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి ఒక్క హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే ప్రజాగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు.

పార్కుల్లో 'స్వచ్ఛతా హీ సేవ'

సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధంపై ర్యాలీ

పటమట(విజయవాడతూర్పు): ఆహ్లాదం కలిగించే పార్కులను నిరంతరం శుభ్రంగా ఉండాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. శుక్రవారం ఆయన స్వచ్ఛతా హీ సేవలో భాగంగా రాజీవ్‌గాంధీ పార్కు, రివర్ ఫ్రంట్, స్క్రాప్ పార్కుల్లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 2, 2024 వరకు జరుపుకుంటున్న స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాల్లో భాగంగా ప్రజలు ఆహ్లాదంగా గడిపే ప్రదేశాలలో శానిటేషన్ డ్రైవ్ నిర్వహించామన్నారు. నగరంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం ఉందని, దీనిపై విస్తృతంగా ప్రచారం చేయాలని పిలుపునిచ్చారు. విజయవాడను ప్లాస్టిక్ రహిత నగరంగా తీర్చిదిద్దాలని, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ని బ్యాన్ చేస్తూ ప్రతి ఒక్కరూ ప్రతిజ్ఞ తీసుకోవాలని కోరారు. పాఠశాల విద్యార్థులు, కళాశాల విద్యార్థులు, నగర పౌరులతో కలిసి ఆయన ర్యాలీ నిర్వహించారు. వీఎంసీ గాంధీజీ మహిళా కళాశాల, బీసెంట్ రోడ్, కృష్ణవేణి రోడ్ల మీదుగా విద్యార్థుల ర్యాలీ కొనసాగింది. ఈ కార్యక్రమంలో టీడీపీ ఫ్లోర్ లీడర్ నెలిబండ్ల బాలస్వామి, కార్పొరేటర్ ఉమ్మిడి వెంకటేశ్వరరావు (చంటి), అడిషనల్ కమిషనర్ (ప్రాజెక్ట్స్) కేవీ సత్యవతి, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పి. రత్నావళి, శానిటరీ సూపర్‌వైజర్లు ఇన్‌స్పెక్టర్లు, సెక్రటరీలు పాల్గొన్నారు.



రివర్‌ఫ్రంట్ పార్కులో మాట్లాడుతున్న వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

పాయకాపురం(విజయవాడరూరల్): స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో భాగంగా శుక్రవారం 62వ డివిజన్ పుచ్చలపల్లి సుందరయ్య మున్సిపల్ హైస్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులు ప్రజలకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. తడి, పొడి చెత్తను వేర్వేర్వేగా సేకరించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంలో ప్రజలు భాగస్వాములు కావాలని జిల్లా సైన్స్ అధికారి, హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు డాక్టర్ మైనం హుస్సేన్ సూచించారు. హైస్కూల్ పరిసర ప్రాంతాల్లో ప్రజలకు అవగాహన కల్గిస్తూ ర్యాలీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శేఖర్, ఉమా, కోటేశ్వరరావు పాల్గొన్నారు.



62వ డివిజన్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

శాశ్వత వరద నివారణ చర్యలు చేపట్టాలి



మధురానగర్(విజయవాడసెంట్రల్): బుడమేరుకు శాశ్వత వరద నివారణ చర్యలు చేపట్టాలని సీపీఐ (ఎం.ఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పి.ప్రసాద్ డిమాండ్ చేశారు. గాంధీనగర్ ప్రెస్ క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. బుడమేరుకు అసాధారణ స్థాయిలో వరద వచ్చిందని చెబుతున్న ప్రభుత్వం తీసుకోవాల్సిన ముందస్తు చర్యలు తీసుకోలేదన్నారు. ముంపు ప్రాంతాల ప్రజలను హెచ్చరించి పునరావాస చర్యల్ని చేపట్టాల్సి ఉన్నా అలా జరగలేదన్నారు. వరదలకు ప్రభుత్వం పూర్తి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. నిర్మాణంలో ఉన్న రాజధాని అమరావతికి శాశ్వత వరద నివారణ కోసం యుద్ధ ప్రాతిపదికన నిధులు కేటాయించే రాష్ట్ర ప్రభుత్వం, లక్షల్లో ప్రజలు నివసించే బెజవాడకు బుడమేరు నుంచి శాశ్వత నివారణకు తక్షణ చర్యలు ఎందుకు చేపట్టలేదని ప్రశ్నించారు. పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు కె.పోలారి, విజయవాడ కార్యదర్శి ఎ.రవిచంద్ర పాల్గొన్నారు.

విద్యార్థులకు అందుబాటులో విలువైన సమాచారం

ఏపీ జనాభా గణన శాఖ సంచాలకుడు బాలకిరణ్

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): ఆంధ్రప్రదేశ్ జనాభా గణన శాఖతో పీబీ సిద్ధార్థ కళాశాల మధ్య ఒప్పందం వల్ల విద్యార్థులకు, పరిశోధనలు చేసే వారికి, పీహెచ్‌డీ చేసే వారికి ఎంతో విలువైన సమాచారం అందుబాటులో ఉంటుందని ఆంధ్రప్రదేశ్ జనాభా గణన శాఖ సంచాలకుడు పి.బాలకిరణ్ చెప్పారు. సిద్ధార్థ కళాశాల ఆవరణలోని వెబ్‌నార్ హాలులో ఏపీ జనాభా గణన శాఖ, సిద్ధార్థ కళాశాల మధ్య ఒప్పంద పత్రాల మార్పిడి కార్యక్రమం శుక్రవారం జరిగింది. కళాశాల డైరెక్టర్ వేమూరి బాబూరావు, డీన్ రాజేష్ సి.జంపాల, కళాశాల సాంఖ్యాక శాస్త్ర విభాగాధిపతి జి.చక్రవర్తితో పాటుగా జనాభా గణన శాఖ డైరెక్టరేట్‌లోని ఉప సంచాలకుడు శిశుకుమార్ హాజరై ఒప్పంద పత్రాలను మార్పిడి చేసుకున్నారు. ఈ ఒప్పందం వల్ల తమ కళాశాలలోని విద్యార్థులతో పాటుగా పీహెచ్‌డీ చేసే వారు ఎవరికైనా జనాభా గణంకాల గురించి ఏ విధమైన సమాచారం కావాలన్నా సులభంగా తెలుసుకోవచ్చని చెప్పారు. ఏపీ జనాభా గణన శాఖతో ఒప్పందం కుదుర్చుకున్న మొదటి కళాశాల ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తమదేనని రమేష్ చెప్పారు. ఈ జనాభా గణంకాల వివరాలను తెలుసుకోవడానికి అవసరమైన ప్రత్యేకంగా ల్యాబ్‌ను కూడా కళాశాల ఆవరణలో సిద్ధం చేశామని రమేష్ చెప్పారు.



ఒప్పంద పత్రాలను చూపిస్తున్న ప్రిన్సిపాల్ ఎం.రమేష్, జనాభా గణన శాఖ సంచాలకుడు బాలకిరణ్

వరద బాధితులకు నిత్యావసర సరుకుల పంపిణీ

పాయకాపురం(విజయవాడరూరల్): వరదల్లో సర్వస్వం కోల్పోయిన బాధితులను ఆదుకునేందుకు ఆంధ్రప్రదేశ్ కేటరింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం నితావ్యసర సరుకుల పంపిణీ జరిగింది. కండ్రికలోని లగడపాటి కల్యాణ మండపంలో వెయ్యిమందికి నిత్యావసరాలను అసోసియేషన్ సభ్యులు అందజేశారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వీఎస్ రవికుమార్ మాట్లాడుతూ తెలంగాణ కేటరర్ అసోసియేషన్, ఆల్ ఇండియా కేటరర్ అసోసియేషన్, ఆంధ్రప్రదేశ్ కేటరింగ్ కస్టమర్స్ వారు సహకారం అందించారని తెలిపారు. కార్యక్రమంలో అడ్మినిస్ట్రేషన్ సెక్రటరీ మున్నా, వై బాలగంగాధర్ తిలక్, సుధారాణి, రమేష్‌బాబు, పలువురు అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

మధురానగర్(విజయవాడసెంట్రల్): వరద బాధితులకు శుక్రవారం హైదరాబాద్ రామంతపూర్, నేలకొండపల్లి క్రీస్తు సంఘం సహకారంతో రామకృష్ణాపురం, బుడమేరు మధ్యకట్ట, అజిత్ సింగ్‌నగర్ తదితర ప్రాంతాల్లో ఆహార పొట్లాలు, నిత్యావసర సరుకులు అందజేశారు. క్రీస్తు సంఘం ఫాస్టర్ దేవరపల్లి అశోక్‌కుమార్, పిల్లల వెంకటస్వామి, ఆనందరావు, పెనుగొండ పవన్‌కుమార్, రాజా పాల్గొన్నారు.

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): సింగ్‌నగర్‌లో బుడమేరు వరద ముంపునకు గురైన భట్రాజు కుటుంబాలకు భట్రాజు ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం ఆర్థిక సాయాన్ని అందించారు. 40 భట్రాజు కుటుంబాలకు రూ. 5 వేల చొప్పున ట్రస్ట్ చైర్మన్ కూరపాటి రామరాజు చేతులమీదుగా అందజేశారు. ట్రస్ట్ రాష్ట్ర అధ్యక్షుడు చక్రాల ఫకీర్ రాజు, వర్లకవి రాఘవ, కంఠస్ఫూర్తి వీరసత్తిరాజు, తంగెళ్ల ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు. అలాగే సింగ్‌నగర్, పాయకాపురం, శాంతినగర్‌లోని వరద బాధితులకు మార్పు వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో 500 మందికి అన్నదాన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఆ సొసైటీ వ్యవస్థాపకులు తులసి పద్మశ్రీ మాట్లాడుతూ సమాజ సేవలో భాగంగా వరద బాధితులకు తమ వంతు సాయంగా ఆహారం, తాగునీరు అందిస్తున్నామని తెలిపారు.



కండ్రికలో బాధితులకు నిత్యావసర సరుకులు అందజేస్తున్న అసోసియేషన్ సభ్యులు



భట్రాజు కుటుంబాలకు చెక్కు అందిస్తున్న ట్రస్ట్ సభ్యులు



వాంబేకాలనీలోని బాధితులకు దుస్తులు అందజేస్తున్న రిటైర్డ్ సీఐ ఉమామహేశ్వరరావు



న్యూఆర్ఆర్‌పేటలో కిట్లు పంపిణీ చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో కిట్ల పంపిణీ..

స్థానిక 57వ డివిజన్ న్యూరాజరాజేశ్వరీపేటలోని వరద బాధితులకు వైఎస్సార్ సీపీ నాయకులు అండగా నిలిచారు. పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు డివిజన్‌లోని బాధితులకు నిత్యావసర సరుకులను అందించారు. స్థానిక కార్పొరేటర్ ఇసరపు దేవి, వైఎస్సార్ సీపీ నాయకులు రాజు, బాల తదితరులు పాల్గొన్నారు.

విజయవాడస్పోర్ట్స్: బుడమేరు వరద ప్రభావిత ప్రాంతాలైన వాంబేకాలనీ, ఆంధ్రప్రభకాలనీ, సుందరయ్యనగర్, సింగ్‌నగర్‌ల్లోని 100 మంది నిరుపేదలకు రిటైర్డ్ సీఐ జి.ఉమామహేశ్వరరావు శుక్రవారం దుస్తులు పంపిణీ చేశారు. ఆయన వన్‌టౌన్, గవర్నర్‌పేట, ఉయ్యూరు పోలీస్‌స్టేషన్‌ల్లో సీఐగా పని చేసి 2012లో రిటైర్డ్ అయ్యారు. తనవంతు సాయంగా బాధితులకు దుస్తులు అందజేశానని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఆయన భార్య నాగేశ్వరమ్మ, కుమారులు జయప్రకాష్, ప్రసాద్ పాల్గొన్నారు.

తెలుగు వారు గర్వించదగిన నటుడు అక్కినేని

విజయవాడ కల్చరల్: ప్రతి తెలుగు వాడు గర్వించదగిన నటుడు అక్కినేని నాగేశ్వరరావు అని మహానటి సావిత్రి సంక్షేమ సంఘం వ్యవస్థాపకురాలు పరచూరి విజయలక్ష్మి అన్నారు. కళాపీఠం ఆధ్వర్యంలో శుక్రవారం గవర్నర్‌పేటలోని సంస్థ కార్యాలయంలో అక్కినేని శత జయంతి వేడుకలు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఆయన ఏ పాత్ర పోషించినా ఆ పాత్రలో పరకాయ ప్రవేశం చేయగలడన్నారు. అనంతరం అక్కినేని చిత్రపటానికి నివాళి సమర్పించారు. చింతకాయల చిట్టిబాబు, పీ వెంకన్న, గాయకుడు చంద్రశేఖర్, ఎమ్ఎస్ నారాయణ పాల్గొన్నారు.

బెజవాడ బార్ అసోసియేషన్ కార్యాలయంలో..

న్యాయవాది చీదెళ్ల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో బెజవాడ బార్ అసోసియేషన్ కార్యాలయంలో అక్కినేని శత జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించి కేక్ కట్ చేశారు. బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు చలసాని అజయ్ కుమార్, పరమేశ్వరరావు, సీనియర్ న్యాయవాది గద్దం రాజేశ్వరరావు, అరిగెల శివరాంప్రసాద్, వీవీ సుబ్రహ్మణ్యం, రాజ్యలక్ష్మి పాల్గొన్నారు. అక్కినేని ఫౌండేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఇదే కార్యాలయంలో సినీ సంగీత విభావరి నిర్వహించారు.

మధురానగర్(విజయవాడసెంట్రల్): దుర్గాపురంలో డాక్టర్ బ్రహ్మదేశం సోషల్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యాన శుక్రవారం దాదా సాహెబ్ ఫాల్కే అవార్డు గ్రహీత, పద్మవిభూషణ్ డాక్టర్ అక్కినేని నాగేశ్వరరావు శత జయంతి ఘనంగా జరిగింది. అక్కినేని చిత్రపటానికి కార్పొరేటర్ ఉమ్మడి వెంకటేశ్వరరావు, వాకర్స్ క్లబ్ డెప్యూటీ గవర్నర్ డాక్టర్ బీ వసంతకుమార్ పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అక్కినేని నటించిన చిత్రాలు అజరామమని పేర్కొన్నారు. అక్కినేని శిలా విగ్రహాన్ని తుమ్మలపల్లి కళాక్షేత్రం ప్రాంగణంలో ఏర్పాటు చేసేందుకు కార్పొరేటర్ వేంకటేశ్వరరావు అందిస్తున్న సహకారం మరువలేనిదని అన్నారు. అనంతరం మాతృదేవోభవ ఆశ్రమంలో వృద్ధులకు అన్నదానం చేశారు. సొసైటీ కార్యదర్శి కొండాయగుంట రాము, గుర్రం ఏడుకొండలు, రాజారావు, బోడి ఆంజనేయరాజు, విశ్వేశరయ్య తదితరులు పాల్గొన్నారు.



అక్కినేని శత జయంతి వేడుకల్లో బెజవాడ బార్ అసోసియేషన్ సభ్యులు



బ్రహ్మదేశం సోషల్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో అక్కినేని చిత్రపటం వద్ద నివాళి

అడుసుమిల్లి మరణం కలచివేసింది

మధురానగర్(విజయవాడసెంట్రల్): మాజీ శాసనసభ్యుడు అడుసుమిల్లి జయప్రకాష్ మరణం కలచివేసిందని వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు మల్లాది విష్ణు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయన అజాత శత్రువని అన్నారు. అడుసుమిల్లి మరణం విజయవాడ ప్రజలకు తీరని లోటు అని చెప్పారు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థిస్తూ.. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

అడుసుమిల్లి మరణం దిగ్భ్రాంతికి గురిచేసింది

మాజీ ఎమ్మెల్యే అడుసుమిల్లి జయప్రకాష్ అకాల మరణం తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా వైద్య విభాగం అధ్యక్షుడు డాక్టర్ అంబటి నాగ రాధాకృష్ణ యాదవ్ శుక్రవారం ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు.

నిత్యాన్నదానానికి రూ. 50వేలు విరాళం



బాబావారి శేషవస్త్రం, చిత్రపటంతో దాతలను సత్కరిస్తున్న డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఆంధ్రా షిర్డీగా విరాజిల్లుతున్న ముత్యాలంపాడు శ్రీషిర్డీ సాయిబాబా మందిరంలో నిత్యాన్నదానానికి మొగల్రాజపురానికి చెందిన దాత ప్రేమలత తరుపున ఎం. వెంకట మాధవి రూ. 50,116 వేలను మందిర గౌరవాధ్యక్షుడు డాక్టర్ పూనూరు గౌతం రెడ్డికి శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా గౌతంరెడ్డి మాట్లాడుతూ మందిరంలో తాము తలపెట్టిన ప్రతీ కార్యక్రమానికి భక్తులు, దాతలు అందిస్తున్న సహాయ సహకారాలు మరువలేనివన్నారు. భక్తులు, దాతల సహకారంతో తాము సేవ, ఆధ్యాత్మిక కార్యక్రమాలను భక్తుల మనోభావాలకు అనుగుణంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి బాబావారి శేషవస్త్రం, చిత్రపటంతో దాతలను సత్కరించారు. కార్యక్రమంలో మందిరం కోశాధికారి మండలపర్తి సత్యశ్రీహరి పాల్గొన్నారు.

ఆస్వాదిద్దాం 'అన్నగారి విందు బజార్'



లైవ్ కుకింగ్ చేస్తున్న చెఫ్ దాము

లబ్బీపేట(విజయవాడతూర్పు): జీఆర్టీ హోటల్స్‌కు చెందిన గ్రాండ్ విజయవాడలో మూడు రోజుల పాటు నిర్వహించే అన్నగారి విందు బజార్ శుక్రవారం ప్రారంభమైంది. ఈ ఫెస్టివల్‌లో ఆంధ్రా, తెలంగాణ, తమిళనాడు, కేరళ వంటకాలు విందు బజార్‌లో ఆహార ప్రియుల కోసం కొలువుదీరాయి. ఈ వంటల మహోత్సవంలో ప్రఖ్యాత సెలబ్రిటీ చెఫ్ దాము నేతృత్వంలో నిపుణులైన చెఫ్‌లు తయారు చేసే నోరూరించే వంటకాల రుచులను నగర వాసులు ఆస్వాదించేలా ఫెస్టివల్ నిర్వహిస్తున్నట్లు హోటల్ మేనేజర్ హరిప్రసాద్ తెలిపారు. ఈ ఫెస్టివల్‌లో భాగంగా చెఫ్ దాము ప్రత్యక్ష వంటల ప్రదర్శన, ప్రత్యేకమైన ఫ్లాష్‌మాబ్, ఇంటరాక్టివ్ సెలబ్రిటీ చెఫ్ సెషన్స్, బహుమతులు వంటివి ఉంటాయన్నారు. అంతేకాక సీజనల్ వంటకాలు కూడా ఈ ఫెస్టివల్‌లో కొలువుదీరనున్నట్లు తెలిపారు. శనివారం రాత్రి 7.30 నుంచి 10.30 వరకూ, ఆదివారం 12.30 నుంచి 3 గంటల వరకూ ఈ ఫెస్టివల్ ఉంటుందని హరిప్రసాద్ తెలిపారు. జీఆర్టీ హోటల్స్ కార్పొరేట్ చెఫ్ సీతారామ్‌ప్రసాద్, సీతారామ్ ప్రసాద్, హెడ్‌చెఫ్ శ్రీధర్ పాల్గొన్నారు.